సాక్షి జగిత్యాల

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



మహాగణపతికి పూజలు

ధర్మపురి: శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలోని మహాగణపతి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ప్రవీణ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు చేశారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 18 కోడెలు, 2 ఆవులను పెద్దనాగారం శివపార్వతీ గోశాలకు శనివారం అందజేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

9న జిల్లాలో లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి నారాయణ

జగిత్యాలజోన్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.నారాయణ సూచించారు. స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీస్ అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోదగ్గ కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇందులో సివిల్, క్రిమినల్, ట్రాఫిక్ కేసులు పరిష్కరిస్తామని చెప్పారు. సబ్ జడ్జి ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జిలు కె.శ్రీనిజ, జితేందర్, వినీల్‌కుమార్, డీఎస్పీ వెంకటస్వామి, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తన రావాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రసాద్

జగిత్యాలజోన్: ఖైదీలకు జైలు జీవితం ఓ గుణపాఠం కావాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్ సూచించారు. స్థానిక స్పెషల్ సబ్ జైలును జడ్జి శనివారం తనిఖీ చేశారు. వసతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్నారని చెప్పారు. దీనిద్వారా ఒక్కరికే కాకుండా, ఆ కుటుంబసభ్యులు కూడా సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలర్ మొగిలేశ్, హెడ్ వార్డర్ మజారొద్దీన్, జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ కటుకం చంద్రమోహన్, డిప్యూటీ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ పి.సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య' సక్సెస్‌పై సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న ప్రతినిధులు

జగిత్యాలటౌన్: ఆదిత్య ఎల్‌- 1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో పట్టణ ప్రజలు శనివారం సంబురాలు జరుపుకున్నారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. చంద్రయాన్‌- 3 స్ఫూర్తితో ఇస్రో మరో ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని, సూర్యుని గుట్టు విప్పేందుకు చేపట్టిన ఆదిత్య ఎల్‌-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి వెళ్లడం దేశప్రజలకు గర్వకారణమని అన్నారు. భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, ప్రతినిధులు అక్కినపెల్లి కాశీనాథం, అరవ లక్ష్మి, నరేందర్ రాజు, బిట్టూ, వేముల పోచమల్లు, సిరిపురం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

'జీవో జారీ చేసేవరకూ సమ్మె విరమించేది లేదు'



ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించి జీవో జారీచేసే వరకూ సమ్మె చేస్తామని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ అన్నారు. వారు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మధురిమ మాట్లాడుతూ, తమ డిమాండ్లపై కమిటీ వేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, క్రమబద్ధీకరణపై స్పష్టమైన జీవో ఇచ్చేవరకూ సమ్మె విరమించేది లేదన్నారు. గూడూరి జయప్రద, నీరజ, పద్మ, ఎలిజబెత్, ఊర్మిళ, మేరీ, శారద, మాదేషి శిరీష, మధులత, రాజశ్రీ, రాజేశ్వరి, సుమలత, గోదావరి, వనిత పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ భాస్కర్



కోరుట్ల బస్టాండ్‌లో చందన, ఆమె ప్రియుడు(సీసీ ఫుటేజీ)

ఆశలు సమాధి

కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



దీప్తి(ఫైల్)



చందన(నిందితురాలు)



ఉమర్ షేక్(చందన ప్రియుడు)

- కూతుళ్ల వివాహ సన్నాహాల్లో తల్లిదండ్రులు
- పెళ్లి సంబంధాలు చూస్తుండగానే దుర్ఘటన
- హత్యకు గురైన పెద్దకూతురు
- హంతకురాలిగా మారి కటకటాల పాలైన చిన్నకూతురు
- విషాదంలో శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులు

వాళ్లకు ఇద్దరు కూతుళ్లు.. అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.. రెండు బంగారు వడ్డాణాలు.. రెండు జతల బంగారు గాజులు.. ఇద్దరికీ కమ్మలు, బుట్టాలు చేయించారు. ఎవరినీ తక్కువగా చూడలేదు.. అంతేకాదు.. వివాహాలకు అవసరమైన ఆభరణాలూ సిద్ధం చేశారు.. పెళ్లి సంబంధాలు చూడడంలో నిమగ్నమయ్యారు.. అంతలోనే పెద్దకూతురు ప్రాణాలు కోల్పోవడం.. చిన్నకూతురు జైలుకు వెళ్లడం ఆ దంపతులకు తీరని వేదన మిగిల్చింది.. సొంత అక్కనే హత్యచేసిన చెల్లెలు అని పోలీసుల విచారణలో తేలడంతో వారి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి– మాధవి కన్నీరుమున్నీరవుతున్నారు.

కోరుట్ల: బంక శ్రీనివాస్‌రెడ్డి నెల్లూరు జిల్లా నుంచి సుమారు పాతికేళ్ల క్రితం ఉపాధి కోసం కోరుట్లకు వలస వచ్చారు. భార్య మాధవితో కలిసి చిన్నాచితకా పనులు చేశారు. చివరకు ఇటుకబట్టీ వ్యాపారంలో స్థిరపడి మంచిపేరు తెచ్చుకున్నారు. ఈ దంపతులకు పెద్దకూతురు దీప్తి, చిన్నకూతురు చందన, కుమారుడు సాయి సంతానం. చిన్ననాటి నుంచి కూతుళ్లను అల్లారుముద్దుగా పెంచారు. ఇద్దరినీ బీటెక్ చదివించారు. నాలుగేళ్ల క్రితం దీప్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పుణేలోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. చందన ఇటీవల బీటెక్ పూర్తిచేసింది. కొడుకు సాయి బెంగళూర్‌లో డిగ్రీ చదువుతున్నాడు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం పాతికేళ్లుగా కష్టపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు.. పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయడానికి ఆర్నెల్లుగా మంచిసంబంధాలు చూస్తున్నారు.

పెళ్లిళ్ల కోసం స్థలాలు విక్రయించి..

- ఇటుకబట్టీ వ్యాపారంలో అంతోఇంతో సంపాదించిన శ్రీనివాస్‌రెడ్డి.. తాను కొనుగోలు చేసిన స్థలాలను ఇటీవల విక్రయించారు.
- ఇలా తన కూతుళ్లు దీప్తి, చందన వివాహాల కోసం డబ్బు, నగలు సమకూర్చుకున్నారు.
- సుమారు రూ.90 లక్షలు వెచ్చించి పెళ్లిళ్లకు అవసరమైన వడ్డాణాలు, చైన్‌లు, కమ్మలు, బుట్టాలు, హారాలు తయారు చేయించారు.
- వీటితోపాటు కొంత నగదు సిద్ధం చేసుకున్నారు.
- తన సొంతూరు నెల్లూరుకు వెళ్లి మంచి సంబంధాలు చూస్తున్నారు.
- కానీ, ఇంతలోనే దీప్తి హత్య ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది.

విశ్రాంతి సమయంలో విషాదం..

కూతుళ్లకు వివాహం చేసి చరమాంకంలో విశ్రాంతి తీసుకుందామని యోచించిన శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు దీప్తి హత్య షాక్ ఇచ్చింది. పెద్దకూతురు హత్యకు గురికావడమే కాకుండా.. చంపింది చిన్నకూతురు చందన కావడం వారిని నివ్వెరపరిచింది. అంతేకాదు.. పెళ్లిళ్ల కోసం తాను సమకూర్చిన నగలు, నగదు తీసుకుని చందన ప్రియుడితో పరారైన వైనం శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఆశనిపాతంగా మారింది. ప్రస్తుతం దీప్తి హత్యకు గురికావడం, ప్రియుడు ఉమర్ షేక్‌తో కలిసి అక్కను హత్యచేసి చందన జైలుపాలు కావడంతో శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఈ దీనస్థితి పట్టణవాసులను తీవ్రంగా కలచివేసింది.

విషజ్వరాల విజృంభణ



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లు

- జనరల్ ఆస్పత్రిలో పెరుగుతున్న ఓపీ కేసులు
- పారిశుధ్య లోపం, వాతావరణంలో మార్పులు కారణం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారుల సూచన

జిల్లా సమాచారం

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జనరల్ ఆస్పత్రిలో నమోదైన కేసులు

డెంగీ	మలేరియా	టైఫాయిడ్
33	2	196

జగిత్యాల: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణ మార్పులు, పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. రోజుల తరబడి తల, ఒళ్లు, మోకాళ్ల నొప్పులతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిని 'సాక్షి' శనివారం ఉదయం 9గంటలకు విజిట్ చేయగా జ్వరపీడితులే అధికంగా కనిపించారు. నిత్యం 200 మందికిగాపై ఇన్‌పేషెంట్లు ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. జిల్లాలో 17 పీహెచ్‌సీలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 2 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ఒక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఒక ఎంసీహెచ్‌లోనూ జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద వైద్యం తీసుకుంటున్నారు.

టైఫాయిడ్, మలేరియా బాధితులు..

- జిల్లాలో టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నట్లు ల్యాబుల్లో నిర్ధారిస్తున్నారు.
- ఇప్పటిదాకా డెంగీ కేసులు ఏమీ నమోదు కాలేదని జనరల్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.
- కానీ, ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు.
- మరోవైపు.. సాధారణ జ్వరమా, టైఫాయిడా, డెంగీనా అనేది తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- మరోవైపు.. జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, 380 గ్రామాల్లో ఎక్కడా ఫాగింగ్ చేయడంలేదు.



బెడ్స్ సరిపోక వరండాలోనే ఉన్న పేషెంట్లు



ఓపీ విభాగంలో బారులు తీరిన పేషెంట్లు

- నీటి నిల్వలతోనూ వ్యాధుల ముప్పు పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.
- దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడులు చేస్తున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మూడు రోజులుగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– శ్రీధర్, ఆర్‌ఎంవో, జనరల్ ఆస్పత్రి, జగిత్యాల

ఓటరు జాబితాలో పేర్లు చేర్చండి

- కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఫాం 6, 7, 8 ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. వందశాతం ఎస్టీ జనాభా ఉన్న , పురాతన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. ఫాం 6, 8 ప్రచురించి పంపిణీ చేసేంత వరకూ చర్యలు తీసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

సమయం చాలా విలువైందని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తూ అన్ని పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు దివాకర, లత, ఆర్డీవోలు పాల్గొన్నారు.

అర్హులు పేర్లు నమోదు చేసుకోండి

జగిత్యాలరూరల్: జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టారు. కలెక్టర్ ఈ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అర్హులు బీఎల్‌వోల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 785 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టామని తెలిపారు. ఓటర్ల చేర్పులు, మార్పులపై తమ అభ్యంతరాలు తెలపాలని కోరారు. ఆర్డీవో నర్సింహమూర్తి, తహసీల్దార్ రాంమోహన్ పాల్గొన్నారు.

8నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ జనరల్ వైద్యశాల, మాతా శిశు సంక్షేమ కేంద్రంలో ఈనెల 8వ తేదీ నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ఆర్థో, 13న హియరింగ్, 15న ఆర్థో, 20న ఎంఆర్, 22న ఆర్థో, 27న విజువల్ సంబంధిత శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండల, మున్సిపాలిటీలకు చెందిన దివ్యాంగులు హాజరు కావాలని సూచించారు. మీసేవలో బుక్ చేసుకున్న స్లాట్ రసీదు, ఆధార్ కార్డు, సదరం కాలపరిమితి ముగిసిన సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలని కోరారు.

వైఎస్సార్ హయాంలోనే సంక్షేమ ఫలాలు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

జగిత్యాలటౌన్: దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అడ్లూరి మాట్లాడారు. చేవెళ్ల నుంచి శ్రీకాకుళం వరకు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను ఆకలింపు చేసుకున్న వైఎస్సార్.. ప్రజల అభీష్టం మేరకు అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అడ్లూరి అన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నేహాల్, గుండ మధు పాల్గొన్నారు.




నివాళి అర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌ను ఆదరించండి


ధర్మపురి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని, మోసపూరిత బీఆర్‌ఎస్‌ను నమ్మవద్దని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మపురి ఎస్సీ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించడం కోసం పుణె మాజీ ఎమ్మెల్యే మోహన్ జోషిని ఇన్‌చార్జిగా నియమించారని, ఆయన ఈనెల 5న ధర్మపురిలో పర్యటిస్తారని తెలిపారు. టికెట్ విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దినేశ్, సింహరాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్, రఫియొద్దీన్, వేముల రాజేశ్, అప్పం తిరుపతి, స్తంభంకాడి గణేశ్, షబ్బీర్, గరిగె రమేశ్ పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

- రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా వెంకటరాజం
- అవార్డుకు ఎంపికైన రాయికల్ పాఠశాల ఉపాధ్యాయుడు



వెంకటరాజం



అభయ్‌రాజ్

కోరుట్లరూరల్: విధి నిర్వహణ, విద్యాబోధనలో ప్రతిభ చూపిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడిని రాష్ట్రస్థాయి పురస్కారాలు వరించాయి. కోరుట్ల మండలం పైడిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి వెంకటరాజం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. వెంకటరాజం 2015లో పైడిమడుగు ఉన్నత పాఠశాలలో చేరారు. ఆ సమయంలో బడిలో 47 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయన డ్రాపవుట్స్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఇంటింటా పర్యటించి తల్లిదండ్రులను కలుసుకున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. దీంతో విద్యార్థుల సంఖ్యను 176కు తీసుకొచ్చారు. తన సొంత సొమ్ము వెచ్చించి తెలుగు–ఇంగ్లిష్ పుస్తకం రూపొందించారు. 200 మంది విద్యార్థులకు ఆ పుస్తకాలు పంపిణీ చేసి ప్రాక్టీస్ చేయించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం ఏటా జూన్ నుంచే ప్రణాళిక సిద్ధం చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో గత 8 సంవత్సరాలుగా పైడిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడి అవార్డుకు ఎంపికచేశారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెంకటరాజం హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటారు. ఆయనను ఎంఈవో గంగుల నరేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయికల్(జగిత్యాల): రామారావుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 5న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశామంటూ ప్రభుత్వ కార్యదర్శి వాకటి కరుణ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అభయ్‌రాజ్‌ను డీఈవో జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ తిరుమల్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ లావణ్య, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందరావు తదితరులు అభినందించారు.


యశోద హాస్పిటల్స్ — యశోద మెడికల్ సెంటర్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
రక్తనాళాల వ్యాధులు : రక్తప్రసరణ ఆగిపోవుట, పాదములు నల్లబడుట, రక్త నాళములు చిట్లి పోవుట, ఉబ్బిన నరాలు ఉబ్బడం, రక్త నాళాల పునరుద్ధరణ	డా॥ దేవేందర్ సింగ్, MS, DNB (Vascular), FIVS (UK)	03-09-2023 ఆదివారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు, వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ మనోజ్ చక్రవర్తి, MS (Ortho), M.Ch (Ortho)	
క్యాన్సర్, హిమటాలజీ వ్యాధులు : అసాధారణ ముద్దలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ముల్లో నొప్పిలేని కణతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	డా॥ రాజేష్ బొల్లం, MBBS (Gold Medalist), DNB (General Medicine), DM (Medical Oncology) (TMH)	05-09-2023 మంగళవారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
వెన్నెముక వ్యాధులకు కన్సల్టేషన్ : నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు చేతులు తిమ్మిర్లు, నరం ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స (స్కోలియోసిస్ సర్జరీ), వెన్నెముక ఇన్‌ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ కిరణ్ కుమార్ లింగుట్ల, MBBS, D Ortho, MRCS (Edinburgh-UK), FRCS Ed (Tr & Ortho), Mch Ortho UK, BOA Sr Spine Fellowship UHW, Cardiff, UK	
గ్యాస్ట్రో వ్యాధులు : ప్యాంక్రియాస్, లివర్, కడుపు మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధులు	డా॥ ఎం.ఎస్. పవన్ కుమార్, MS, M.Ch (AIIMS), FLT (Seoul)	
న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్ అవ్వడం, కాళ్ళల్లో రక్తనాళాలు మెలిక పడటం, కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినప్పుడు రక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్ అవ్వడం	డా॥ శ్రీహరీష్ వంకాయలపాటి, MBBS, DNB, DM (Neuro & Interventional Radiology), MNAMS, EDIR (European diploma in radiology)	06-09-2023 బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు, వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ అమిత్ రెడ్డి పి, MBBS, PGD (Orthopaedics), DNB (Orthopaedic Surgery), MNAMS (Orthopaedic Surgery)	
కిడ్నీ వ్యాధులు : రోబోటిక్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ల్యాప్రోస్కోపిక్ యూరాలజీ, ఆండ్రాలజీ మరియు మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ యూరాలజీ.	డా॥ పి. విభీషేశ్వర్, MBBS, MS, Mch (AIIMS, Jodhpur), Vattikuti Uro-Oncology & Robotic Fellow (MI, USA)	
మెదడు, వెన్నెముక, మరియు నరాల వ్యాధులకు కన్సల్టేషన్ : నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, నరం ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స, వెన్నెముక ఇన్‌ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ బాల రాజశేఖర్ చంద్ర, MS, MCh, (PGI Chandigarh)	
కండరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అన్నిరకముల ఎముకల వ్యాధులు	డా॥ వి. రాజేంద్ర వరప్రసాద్, MD, DM Rheumatology, APLAR Fellow, Former Associate Professor in Rheumatology, NIMS	07-09-2023 గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు, వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ మహమ్మద్ ఎజాజ్ ఉద్దీన్, MS (Orthopaedics), DNB (Orthopaedics), MNAMS, FAGE	08-09-2023 శుక్రవారం ఉదయం10 గం॥ నుండి సాయంత్రం 4 గం॥ వరకు
కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ రాజశేఖర చక్రవర్తి ఎమ్, MBBS, MD (Internal Medicine), DNB (Nephrology)	09-09-2023 శనివారం ఉదయం10 గం॥ నుండి సాయంత్రం 4 గం॥ వరకు

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125



క్లుప్తంగా

ఎస్సైకి ఎస్పీ అభినందన



ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

మేడిపెల్లి(వేములవాడ): సంచలనం సృష్టించిన కోరుట్లకు చెందిన బంక దీప్తి హత్య కేసును నాలుగు రోజుల్లోనే ఛేదించి నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మేడిపెల్లి ఎస్సై చిరంజీవిని ఎస్పీ భాస్కర్ అభినందించారు. తనకున్న అనుభవంతో కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నేరాల నియంత్రణకు సహకరిస్తున్నారంటూ ఎస్సైకి రికార్డు ప్రకటించి అభినందించారు.

క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ క్రీడా పాఠశాల హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల ప్రవేశాలకు ఇటీవల ఎంపికపోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లానుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగో తరగతికి ఎస్.చైతన్య (జగిత్యాల), పి.అలకనంద (జగిత్యాల), కె.అమూల్య, డి.శ్రీవర్షిణి (కరీంనగర్), ఏ.అనన్య (పెద్దపల్లి), బి.హర్షిత, ఈ. శ్రీనిజ(రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. ఐదో తరగతికి జి.శ్రీకేష్, పి.సాహిత్ పటేల్ (జగిత్యాల), ఎన్.సిద్దార్థ, జె.హరిహరన్‌యాదవ్ (పెద్దపల్లి), బి.వినమ్రత్ సింహ(రాజన్న సిరిసిల్ల), ఆర్.కావ్యశ్రీ, ఎం.సాహితి, పి.సామిత, ఎ.సంసృతి (జగిత్యాల), ఏ.అక్షిత(కరీంనగర్), టి. అక్షిత, బి.సహస్ర(రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. వీరు ఈ నెల 5న తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్‌లో ఉదయం 9గంట లకు రిపోర్ట్ చేయాలని అధికారులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



భగవాన్‌దాస్(ఫైల్)

రాయికల్(జగిత్యాల): అల్లీపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల భగవాన్‌దాస్(28) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. భగవాన్‌దాస్‌కు అప్పులు కావడం, వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెందాడు. దీంతో ఆగస్టు 31న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి అనుమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధం



జగిత్యాలక్రైం: పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధమైంది. జగిత్యాల పట్టణ శివారులోని గోవిందుపల్లిలో శనివారం తాటిచెట్టుపై పిడుగు పడటంతో కాలిపోయింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

2&3 BHK Flats for sale, Revenue Colony, Tgpalli, Karimnagar, TSR-ERA, Powerbackup. Ph : 9505312461, 9515389258 [HA-4557]

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

కరీంనగర్, హుజురాబాద్‌లో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. సంప్ర।। 7287960491. [W-189161]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

అవగాహన.. ఆచరణ.. ఆరోగ్యం

- సమతుల ఆహారంతోనే ఆరోగ్యభారత్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

జిల్లాలో..

అంగన్‌వాడీ ప్రాజెక్టులు	ధర్మపురి, మల్యాల, మెట్‌పల్లి, జగిత్యాల
అంగన్‌వాడీ కేంద్రాలు	1,065
బాలింతలు	5,995
గర్భిణులు	7,268
చిన్నారులు	28,033



పెగడపల్లిలో పోషణ మాసంపై ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, చిన్నారులు (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): పోషకాలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే చిన్నారులు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారు. అయితే నిరక్షరాస్యత, అవగాహన లోపం, ఆర్థిక పరిస్థితులు ప్రభుత్వం నుంచి అందే సహకారం క్షేత్రస్థాయిలో అందని కారణంగా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం లోపంతో ఉన్నట్లుగా పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. అందుకే ప్రభుత్వాలు 2019 నుంచి సెప్టెంబర్ నెల మొత్తం పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ‘పోషణ్ అభియాన్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 1 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు శిశు సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లావ్యాప్తంగా మెట్‌పల్లి, జగిత్యాల, మల్యాల, ధర్మపురిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, లబ్ధిదారులకు రోజూ కేంద్రం నుంచి గుడ్డు, బాలామృతం, పోషకాహారంతో కూడిన భోజనం, మొక్కజొన్నతో చేసిన మురుకులు అందిస్తున్నారు.

చేపట్టే కార్యక్రమాలు

తల్లిపాలు పరిపూర్ణమైన ఆహారంపై ప్రజలకు అవగాహన, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్యకరమైన పిల్లల పోటీలు, చిన్నారులకు ఆరోగ్యంగా ఉంటూ చదువుకునేందుకు ప్రత్యేక చర్యలు, మేరీ మాటీ మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో పోషణ పంచాయతీ కమిటీలు సమావేశం ఏర్పాటు చేసి పోషణ లోపం, ఆరోగ్యంపై ర్యాలీలు, సభలు ఏర్పాటు చేయడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు శ్రీకారం చుట్టనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మహిళలకు వర్షపు నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. కేంద్రాల్లో న్యూట్రిన్ గార్డెన్లు (పోషణ వాటికల) ఏర్పాటుకు స్థలాలు గుర్తించడం తదితర కార్యక్రమాలు చేపడుతారు.

సాంకేతిక వినియోగం

పోషణ మాసోత్సవంలో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులతో పాటు సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం, లోపాలను అధిగమించడం, రోజు వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను టీచర్లు వివరిస్తున్నారు. సంబంధిత వీడియో, ఆడియో చిత్రాలను వాట్సాప్‌లో పంపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నమోదైన చిన్నారుల బరువు, ఎత్తు చూడాలని నిర్ణయించారు. పోషకాహార లోపంతో బాధపడుతన్న చిన్నారులను గుర్తిస్తున్నారు. వారి వివరాలను సేకరించి నమోదు చేయాల్సి ఉంది. వయసుకు తగ్గట్లుగా ఎదుగుదల లేని, పోషకాహారం లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఏఎన్‌ఎం సహకారంతో చికిత్స చేయాల్సి ఉంటుంది. పౌష్టికాహారం అందాల్సిన తీరును తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

పకడ్బందీగా పోషణమాసం



జిల్లాలో పోషణ మాసోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. చిన్నారుల బరువు, ఎత్తులు తీయడంపై దృష్టి సారిస్తున్నాం. పోషకహార లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి తగిన సలహాలు, సూచనలు చేయాలని టీచర్లకు ఆదేశాలు జారీ చేశాం.

– నరేశ్, శిశు సంక్షేమశాఖ అధికారి

అంతర్‌జిల్లా మోసగాళ్ల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, సీఐ కరుణాకర్

- ప్రైవేట్ సొసైటీ పేరుతో మోసాలు
- ఐదు బ్రాంచ్‌లలో 1,600 మంది దగ్గర రూ.3 కోట్ల వసూలు
- రియల్‌ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడులు
- రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన పోతరాజు లక్ష్మణ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్ 2000 సంవత్సరంలో మంచిర్యాల జిల్లాలో ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ కంపెనీని స్థాపించారు. ఆరు నెలల వ్యవధిలోనే బెల్లంపల్లి, లక్షెట్టిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సొసైటీలు స్థాపించారు. దాదాపు 1600 మంది వరకు ఖాతాలు తెరవడంతో రూ.3 కోట్ల వరకు సేకరించారు. శ్రీధర్ చైర్మన్‌గా, తన పూర్వ విద్యార్థి పోతరాజుల లక్ష్మణ్‌ను సీఈవోగా నియమించుకొని మరికొంత మంది సిబ్బందిని తీసుకున్నారు. ప్రజల నుంచి రికరింగ్ డిపాజిట్స్ ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులను శ్రీధర్, లక్ష్మణ్ కలిసి మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 150 మందికిపైగా సభ్యత్వం కల్పించి, సొసైటీలో ఖాతా తెరిచేందుకు రూ.650 వసూలు చేశారు. తమ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ కాలంలోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. గత నెల 22న వేములవాడకు చెందిన బుస్స శ్రీనివాస్ మరికొందరు బాధితులు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 1న వ్యాపారం కోసం శ్రీధర్, లక్ష్మణ్‌లు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడటౌన్ పోలీసులు నందికమాన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కారు, సొసైటీకి సంబంధించిన కరపత్రాలు, పాస్‌బుక్స్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఫామ్స్, లావాదేవీలకు సంబంధించిన రిజిష్టర్స్, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కంపెనీలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడవద్దని, ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఎదురులేదు



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- సంక్షేమ ఫలితం అందని ఇల్లు లేదు
- అభివృద్ధిలో దేశానికే ఆదర్శం
- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మాజీ జెడ్పీటీసీ వ్యాళ్ల అనిత ఆధ్వర్యంలో ఎండపల్లి మండలం ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాలకు చెందిన వివిధ పార్టీ కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రాజారాంపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్గటూర్ మండలం ముత్తునూర్ సర్పంచ్ అనుమాల తిరుపతి ఆధ్వర్యంలో సుమారు 50మంది కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని తట్టుకోలేక అనవసరపు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరు ఎన్నికుట్రలు చేసినా బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. 40 ఏళ్లపాటు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి రావడానికి మోసపూరిత హామీలు ఇస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, బీఆర్‌ఎస్ ఎండపల్లి, వెల్గటూర్ మండలాల అధ్యక్షులు జగన్, రాంచందర్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహంగా మెదిలి.. బంగారం తీసుకెళ్లి

- బాలికను బెదిరించిన ముగ్గురు యువకులు
- ఇవ్వకపోతే ఫొటోలు మార్ఫింగ్ చేస్తామని బెదిరింపులు
- నిందితులను అరెస్టు చేసిన టూటౌన్ పోలీసులు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ రాంచందర్‌రావు

కరీంనగర్‌క్రైం: మాయమాటలతో పరిచయం చేసుకున్నారు. బంగారం ఉందని తెలిసి స్నేహం పెంచుకున్నారు. సోషల్ మీడియాలో తరుచూ మాట్లాడుకున్నారు. చివరికి బంగారం ఇవ్వాలని, లేకుంటే తన ఫొటోలు మార్ఫింగ్ చేస్తామని ఓ బాలికను బ్లాక్‌మెయిల్ చేసిన ముగ్గురు యువకులను కరీంనగర్ టూటౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ రాంచందర్‌రావు వివరాల మేరకు.. కరీంనగర్‌లోని హుస్సేనిపురకు చెందిన జునైద్(24), భారత్ ఖయ్యూంఖాన్(22), రేకుర్తికి చెందిన దొంత యశ్వంత్‌రాజ్(22) స్నేహితులు. రెండు నెలల క్రితం యశ్వంతరాజ్‌కు నగరానికి చెందిన ఓ బాలిక (16) పరిచయమైంది. అమె తల్లి ప్రభుత్వ ఉద్యోగి. బాలిక ఇంట్లో నగదు, బంగారం ఉందని, వాటిని ఎలాగైనా కాజేయాలనే ఉద్దేశంతో తన స్నేహితులు జునైద్, భారత్ ఖయ్యూంఖాన్‌లకు ఆమెను పరిచయం చేశాడు. వారు పథకం ప్రకారం తరచూ ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేస్తూ స్నేహం చేస్తున్నట్లు నమ్మించారు. ఒకరోజు తనఇంట్లో ఉన్న డబ్బు, బంగారం తీసుకొని నగరంలోని సర్కస్‌గ్రౌండ్ ప్రాంతానికి రావాలని సూచించారు. ఎందుని నిలదీయడంతో, చెప్పినట్లు వినకుంటే బాలిక ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పెడతామని, తనను చంపేస్తామని బెదిరించారు. భయపడిన బాలిక గతనెల 10వ తేదీన మధ్యాహ్నం సర్కస్‌గ్రౌండ్ వద్దకు వచ్చింది. ముగ్గురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి, బంగారం తీసుకుని వెళ్లిపోయారు. విషయాన్ని బాలిక ఆమె తల్లికి చెప్పడంతో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నిందితులను హుస్సేనిపురలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.5,77,500 విలువైన 11.55తులాల బంగారం, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

భూమి ఆక్రమించారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న రంజిత్‌రావు

జగిత్యాలక్రైం: పట్టా భూమిని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని జగిత్యాల పట్టణ శివారులోని గొల్లపల్లి రోడ్ శ్మశానవాటిక వద్ద అయిల్నేని రంజిత్‌రావు శనివారం సాయంత్రం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసుల వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన అయిల్నేని రంజిత్‌రావు గొల్లపల్లి రోడ్‌లో శ్మశానవాటిక వద్ద సర్వేనంబరు 558లో భూమి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇంటి ముందు వాస్తు కోసం 10 ఫీట్ల భూమిని వదిలిపెట్టాడు. కాగా జగిత్యాల అర్బన్ మండలం మత్స్య సహకార సంఘం సభ్యులు రంజిత్‌రావు ఇంటి పక్కన ప్రభుత్వ భూమి ఉందని, సంఘ భవనం నిర్మించేందుకు ఇటీవల హద్దులు ఏర్పాటు చేసి రంజిత్‌రావు భూమిలో గుంతలు తవ్వారు. దీంతో బాధితుడు పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు శనివారం సాయంత్రం మళ్లీ పనులు ప్రారంభించగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ముదిరిన భూ వివాదం

- రెండు వర్గాల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశంతో శాంతించిన ఆందోళనకారులు

జగిత్యాలరూరల్: తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో కొద్దిరోజులుగా జగిత్యాల పట్టణంలోని నిరుపేదలు, సమీప గ్రామాల్లోని పేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని అధికారులు అడ్డుకుంటున్నారు. కొందరిపై ఇప్పటికే రెండుదఫాలు కేసులు నమోదు చేశారు. శనివారం కూడా నిరుపేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నించారు. అయితే, తిమ్మాపూర్ గ్రామ దళితులు, గ్రామస్తులు వారిని అడ్డుకున్నారు. తమ గ్రామంలోని భూములను ఎలా చదును చేస్తారని గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి సంఘటన స్థలానికి చేరుకుని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో చొరబడటం సరికాదని నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం నిరుపేదలు గొల్లపల్లి రోడ్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలోకి ఎవరూ ప్రవేశించకుండా రూరల్ ఎస్సై సదాకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బహ్రెయిన్‌లో కోరుట్లపేట యువకుడి దుర్మరణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బహ్రెయిన్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేటకు చెందిన యువకుడు మేకన్‌పల్లి సుమన్ (26) మృతిచెందాడు. సుమన్ ఐదేళ్లుగా బహ్రెయిన్‌లోని కేరళకు చెందిన కంపెనీలో పనిచేస్తున్నాడు. ఓనమ్ పండుగను పురస్కరించుకొని కంపెనీ ఏర్పాటు చేసిన విందుకు సుమన్, కేరళకు చెందిన నలుగురు కారులో వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదం లో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయం సుమన్ తల్లిదండ్రులు నర్స య్య, నర్సవ్వకు శనివారం తెలిసింది. కోరుట్లపేట ఎంపీటీసీ మధు స్పందించి.. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళా కూలీ మృతి

చొప్పదండి: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని కోనేరుపల్లిలో శనివారం మధ్యాహ్నం పిడుగు పాటుకు ఓ మహిళా కూలీ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం... పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కి చెందిన అప్పాల కొమురవ్వ (60) కూలీ పనిచేసుకొని బతుకుతోంది. శనివారం ఇతర కూలీలతో కలిసి ఆటోలో కరీంనగర్ జిల్లా కోనేరుపల్లి శివారులోని పత్తిచేనులో గడ్డి మొక్కలు తొలగించేందుకు వచ్చింది. మధ్యాహ్నం భోజనం చేసి మళ్లీ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మరో మహిళకు తీవ్ర అస్వస్థతకు గురైంది. జిల్లా నుండి మరో జిల్లాకు కూలీ ప నుల కోసం వచ్చి ప్రకృతి ప్రకోపానికి బలి కావడంతో తోటి కూలీల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఓబీలో ఇద్దరు కార్మికులకు గాయాలు



సంజయ్ తడకేను కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది



చికిత్స పొందుతున్న అశోక్ భట్ల

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ–3లో ప్రైవేట్ ఓబీ పనులు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్ కంపెనీలో వాహనం అదుపుతప్పి ఇద్దరి కార్మికులకు గాయాలయ్యాయి. క్యాంప్ ఆఫీస్ నుంచి వర్క్ షాప్‌కు క్యాంపర్‌లో వెళ్తుండగా వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో వేగంగా వెళ్తున్న వాహనంపై ఇద్దరూ కిందకు దూకారు. ఈ ఘటనలో సంజయ్‌తడకే, అశోక్ భట్లకు గాయాలయ్యాయి. వీరికి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సంజయ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించారు. ఘటనపై సింగరేణి యాజమాన్యం విచారణ చేపట్టింది.

అంత్యక్రియలకు ‘ఆ నలుగురు’ కరువు

- కోరుట్లలో కలచివేసిన ఘటన



ఆటోలో రాజేశ్ మృతదేహం

కోరుట్ల: అనారోగ్యంతో మృతిచెందిన ఓ నిరుపేద యువకుడి అంత్యక్రియలకు ఆ నలుగురు కరువయ్యారు. వైకుంఠ రథం.. పాడే, డప్పు చప్పుళ్లు ఏమీ లేకుండా కేవలం తల్లి, చెల్లి, ఆమె భర్త మాత్రమే దగ్గరుండి అంత్యక్రియులు పూర్తి చేసిన ఘటన కలచివేసింది. వివరాలు.. కోరుట్ల పట్టణంలోని హాజీపురాలో ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న పూసల మంజుకు కొడుకు రాజేశ్ (24), కూతురు స్వప్న ఉన్నారు. కూతురుకు పెళ్లి అయింది. ప్రస్తుతం తల్లి, కొడుకు కలిసి జీవిస్తున్నారు. పదిహేను రోజుల క్రితం రాజేశ్ కాలేయం దెబ్బతిని అనారోగ్యం పాలయ్యాడు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. ఏరియా ఆసుపత్రి నుంచి రాజేశ్ మృతదేహాన్ని తరలించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక తల్లి మంజు విలవిల్లాడింది. అంబులెన్స్ కావాలంటే రూ. 3వేలు అడగడటంతో కోరుట్లకు చెందిన రఫీ వీరి పరిస్థితి తెలుసుకుని జాలిపడి ఆటోలో మృతదేహాన్ని ఎక్కించుకుని కోరుట్ల శ్మశానవాటికకు తరలించాడు. అనంతరం బంధువులు ఎవరూ రాకపోవడంతో తల్లి మంజు, చెల్లి స్వప్న ఆమె భర్త వెంకటేశ్ కేవలం ముగ్గురు మాత్రమే ఉండి రాజేశ్ అంతిమ సంస్కారాలు నిర్వహించిన వైనం కంటతడి పెట్టించింది.

మాకూ అన్ని సౌకర్యాలు కల్పించాలి



రిలే నిరాహార దీక్షలో మాజీ సర్పంచులు

జగిత్యాలటౌన్: తమకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, తమ డిమాండ్లకు మద్దతు తెలిపేవారికే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ నారాయణ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల ఆర్డీవో కార్యాలయం సమీపంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టసభల మాజీ ప్రజాప్రతినిధులకు ఇస్తున్నట్లుగా తమకూ ఇంటి స్థలం లేదా డబుల్‌బెడ్ రూం ఇళ్లు, నెలకు రూ.పది వేల పెన్షన్, హెల్త్ కార్డు, భూమిలేని పేద మాజీ సర్పంచులకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంక్షేమం కోసం వంద కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో మాజీ సర్పంచులు ఎన్నం కిషన్‌రెడ్డి, బాల ముకుందం, కొత్తకొండ లింగాగౌడ్, చందా రాధాకిషన్, పెంబి పెద్దమల్లయ్య, నరేష్, మిట్టపెల్లి జలపతి, ఇస్లావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి ఒకరి మృతి

మంథని: పట్టణంలోని శ్రీరామకాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి పోచమ్మవాడకు చెందిన ఎడ్ల శంకర్(50) మృతి చెందాడు. కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటికి శంకర్ నీళ్లు పడుతున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం తీసిన గుంతలో పడిపోయాడు. తల, ఇతర శరీరభాగాల్లో బలమైన గాయాలు కావడంతో మేస్త్రీతోపాటు కుటుంబ సభ్యులు శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శంకర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. శంకర్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మృతుడి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.